సాక్షి
వికారాబాద్
శనివారం । 21 । జనవరి । 2023



డిజిటలైజేషన్ సాధ్యమేనా?
పాఠశాలల్లో డిజిటల్ విద్య అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. కేంద్రం నిర్ణయంతో అమలు సాధ్యాసాధ్యాలపై చర్చ సాగుతోంది. 8లో▸



తగ్గుతున్న జొన్న సాగు
జొన్న సాగు విస్తీర్ణం ఏటేటా తగ్గుతోంది. గ్రామాల్లో ఎక్కడో ఒక చోట తప్ప జొన్న పైరు కనిపించడం లేదు. 8లో▸



ఆపదలో.. ఆపద్బాంధవుడిలా
ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రాణాపాయ స్థితిలో 108 వాహనంకు ఫోన్ చేస్తే వెంటనే వచ్చి బాధితులను ఆస్పత్రికి తరలిస్తోంది. 9లో▸

న్యూస్‌రీల్

28న జాబ్‌మేళా



జాబ్ మేళా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర యువజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న పట్టణంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధికారి హన్మంత్‌రావుతో కలిసి జాబ్‌మేళా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ యువజన వ్యవహారాల శాఖ ద్వారా జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ లింకేజీ 68శాతం పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

వికారాబాద్ అర్బన్: జిల్లావ్యాప్తంగా ఓటర్ ఐడీకి 68శాతం ఆధార్ అనుసంధానం పూర్తయ్యిందని కలెక్టర్ నిఖిల తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ శుక్రవారం నిర్వహించిన కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వివరాలను వెల్లడించారు. రానున్న రోజుల్లో బీఎల్‌ఓల వారీగా రూట్ మ్యాప్ తయారు చేసి మానిటరింగ్ చేస్తామని తెలిపారు. మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లోనూ ప్రత్యేక దృష్టిసారించి లింకేజీ పనులు పూర్తిచేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా రెవెన్యూ అధికారి అశోక్‌కుమార్ ఎలక్షన్ డీటీ రవీందర్‌దత్తు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నాగవని



కలెక్టర్‌ను కలిసిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.నాగవని నియామకమయ్యారు. ప్రస్తుతం ఆమె నంగరంలోని గాంధీ మెడికల్ కాలేజీలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలెక్టర్ నిఖిల, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌ను కలిశారు.

జంతువులపై కరుణ చూపాలి

వికారాబాద్ అర్బన్: జీవ హింసకు పాల్పడకుండా, అన్ని జంతువులపై కరుణ చూపాలని కలెక్టర్ నిఖిల అన్నారు. జంతుహింస నివారణ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌ఓ అశోక్ కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి అనిల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జంతు సంరక్షణ కోసం పనిచేస్తున్న వారికి స్వచ్ఛంద సంస్థలు, యువత సహకరించాలని కోరారు. వన్యప్రాణులు ఎక్కడైనా ప్రమాదంలో ఉన్నట్లు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పక్షుల నివాసాలైన వృక్షాలను నరకకూడదని సూచించారు. పశువులను, జంతువులను రవాణా చేసే సమయంలో తప్పకుండా నిబంధనలు పాటించాలని తెలిపారు.

'డెక్కన్'లో టెన్షన్

శుక్రవారం సాయంత్రానికీ లభించని ఆ ముగ్గురి ఆచూకీ



జునైద్



జహీర్



వసీం



భవనాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

- భవనం బయట ఆర్తిగా ఎదురుచూస్తున్న కుటుంబీకులు
- మంటలు, పొగ తగ్గినప్పటికీ భరించలేని స్థాయిలో వేడి
- లోపలికి ప్రవేశించ లేకపోతున్న అగ్నిమాపక బృందాలు
- డ్రోన్ల సహాయంతో కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్
- భవనం కూల్చివేతకు సిద్ధమవుతున్న జీహెచ్‌ఎంసీ
- పరిశీలించి వెళ్లిన వరంగల్ నిట్‌కు చెందిన కమిటీ



వైద్య సేవల్ని పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో/రామ్‌గోపాల్‌పేట: సికింద్రాబాద్ మినిస్టర్స్ రోడ్‌లోని రాధా ఆర్కేడ్‌లో ఉన్న డెక్కన్ కార్పొరేట్ అగ్నిప్రమాదంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ దుర్ఘటనలో గల్లంతైన ముగ్గురి ఆచూకీ శుక్రవారం కూడా లభించలేదు. భవనంలోకి అడుగుపెట్టడానికి పరిస్థితులు అనుకూలించకపోవడంతో విక్టిమ్ లోకేషన్ కెమెరాతో (వీఎల్‌సీ) కూడిన డ్రోన్ల సాయంతో సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. రాధా ఆర్కేడ్‌లో గల్లంతైన డెక్కన్ కార్పొరేట్ ఉద్యోగులు జునైద్, వశీం, జహీర్ కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాలని పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు శుక్రవారం ఉదయం ఉపక్రమించారు. వీరి సెల్‌ఫోన్ల లాస్ట్ లోకేషన్స్ గురువారం ఉదయం భవనం వద్దే ఉండగా...ఆ తర్వాత స్విచ్ఛాఫ్ అయ్యాయి. మరోపక్క ప్రమాదానికి కారణాలు విశ్లేషించడానికి క్లూస్‌టీమ్‌ను లోపలకు పంపాలని భావించారు. అయితే మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ దట్టమైన పొగ, భరించలేని వేడి ప్రతికూలంగా మారాయి. వీటి కారణంగా నేరుగా, లేడర్ ద్వారా ప్రయత్నించినా బృందాలు భవనంలోకి అడుగుపెట్టే పరిస్థితి కనిపించలేదు.

స్పష్టత లేదు

ఈ నేపథ్యంలోనే రెండో అంతస్తులో భవనం వెనుక వైపు రెండు చోట్ల మృతదేహాలు ఉన్నట్లు ఆనవాళ్లను శుక్రవారం సాయంత్రం గుర్తించారు. అయితే ఇవి స్పష్టంగా కనిపించకపోవడంతో ఔనా? కాదా? అనేది స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. దీంతో డ్రోన్ కెమెరా చిత్రీకరించిన వీడియోను ఇంప్రొవైజేషన్ విధానంలో విశ్లేషించడానికి ల్యాబ్‌కు పంపించారు. మొదటి అంతస్తులో కొంత వరకు లోపలికి వెళ్లిన డ్రోన్ అక్కడ మెట్ల మార్గం, శ్లాబ్ కూలి ఉన్నట్లు గుర్తించింది. భవనం మొత్తం శిథిలాలు, కాలిపోయిన వస్తువులు ఉండటంతో పాటు బూడిద సుమారు రెండు అడుగుల మేర పేరుకుపోయినట్లు గుర్తించారు. పది గంటలకు పైగా మంటల్లో ఉన్న ఈ ఆరంతస్తుల భవనం స్ట్రక్చరల్ స్టెబిలిటీని నిర్ధారించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ణయించారు. దీంతో వరంగల్ నిట్ నిపుణుల బృందంతో కలిసి పరిశీలించారు. నిట్ డైరెక్టర్ రమణ రావు, జీహెచ్‌ఎంసీ అధికారులు క్రేన్ సహాయంతో భవనం పై అంతస్తుల వరకు వెళ్లి పరిశీలించి మంటల్లో కాలిపోయిన కొన్ని శిథిలాలను సేకరించారు. భవనం పూర్తిగా బలహీనంగా మారిందని దీన్ని పూర్తిగా విశ్లేషించిన తర్వాత మాత్రమే పూర్తి వివరాలు చెప్పగలుగుతామని రమణరావు అన్నారు.



సహాయక చర్యల్లో డీఆర్‌ఎఫ్ బృందం

డ్రోన్ల సాయంతో..



లోపలికి వెళ్లలేక వెనక్కు వచ్చిన టీమ్స్ డ్రోన్ కెమెరాల సాయం తీసుకోవాలని స్పష్టం చేశాయి. దీంతో అధికారులు ఓ ప్రైవేట్ సంస్థను సంప్రదించి వీఎల్‌సీతో కూడిన డ్రోన్లను రప్పించారు. వేడి కారణంగా ఈ డ్రోన్లు సైతం లోపలకు వెళ్లడం సాధ్యం కాకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించారు. భవనం ముందు భాగంతో పాటు నాలుగు వైపుల నుంచి డ్రోన్ ఎగురవేసి అనువైన, ఖాళీగా ఉన్న భాగాల నుంచి లోపలి ప్రాంతాన్ని పరిశీలించారు.

బయటే బస్తీల జనం..

ఈ భవనాన్ని ఆనుకుని ఉన్న కాచిబోలిలో సుమారు 15 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బస్తీలో చాలా ఇళ్లకు శుక్రవారం కూడా తాళాలు కనిపించాయి. భవనం వెనుక ఉన్న ఉత్తమ్ టవర్స్‌లో కిమ్స్ ఆస్పత్రి నర్సింగ్ హాస్టల్ ఉంది. ఇక్కడ నుంచి నర్సులను ఖాళీ చేయించారు. ఈ భవనాన్ని కూల్చిన తర్వాతే చుట్టుపక్కల వారికి అనుమతిస్తామని అధికారులు స్పష్టం చేశారు. మరోపక్క ఈ భవనం కూల్చివేత పనులు ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారని తెలిసింది. శుక్రవారం సాయంత్రం దీన్ని పరిశీలించిన ఆ సంస్థ బృందం కూల్చివేత పూర్తి చేయడానికి మూడు–నాలుగు రోజులు పడుతుందని అభిప్రాయపడింది. గల్లంతైన వారు గుజరాత్ నుంచి వలసవచ్చిన వాళ్లు కావడంతో శుక్రవారం ఉదయానికి వారి కుటుంబీకులు నగరానికి చేరుకున్నారు. తమ వారి కోసం ఆర్తిగా ఎదురు చూస్తున్న వీరికి రెండు మృతదేహాలు కనిపించాయనే వార్త శరాఘాతమైంది. అవి ఎవరివో, కనిపించని మూడో వ్యక్తి ఎక్కడ ఉన్నాడో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వసీం సోదరుడు ఇమ్రాన్, జునైద్ సోదరుడు ఆసిఫ్ రోజంతా భవనం ముందే గడిపారు. చీకటి పడటంతో శుక్రవారం రాత్రి సెర్చ్ ఆపరేషన్ ఆపేసిన అధికారులు శనివారం మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించారు. అగ్నిప్రమాదం తీరు తెన్నులు, భవనం లోపలి పరిస్థితులను గమనించిన ఓ పోలీసు అధికారి 'ఆ ముగ్గురూ బతికే అవకాశాలు లేవు. ఇన్ని గంటల మంటలు, ఇంత వేడి, ఫైర్ ఇంజన్లు చల్లిన నీళ్ల..ఇవన్నీ పరిశీలిస్తుంటే వారి ఎముకలు దొరికే అవకాశమూ తక్కువే' అని వ్యాఖ్యానించారు.

కోట్‌పల్లికి 'నీటి గండం'

మొరాయించిన బేబీ కెనాల్ షటర్

- ఏకధాటిగా దిగువకు పారుతున్న నీళ్లు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- టెక్నీషియన్ రాకకోసం ఇరిగేషన్ అధికారుల ఎదురుచూపు



బేబీకెనాల్ కాల్వ నుంచి వరదలా ప్రవహిస్తున్న ప్రాజెక్టు నీరు

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టులోని నీటికి పెద్ద గండమే వచ్చిపడింది.. ఆయకట్టు కింద సాగు చేసిన పంటల కోసం మొదటి తడి అందించేందుకు మూడు రోజుల క్రితం బేబీ కెనాల్ తూము నుంచి నీటిని వదిలారు. శుక్రవారం షటర్‌ను దించేందుకు గ్యాంగ్‌మెన్లు, అధికారులు ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దీంతో నీరంతా దిగువకు పారుతోంది. రెండో తడి అందించేందుకు పదిహేను రోజుల గడువు ఉన్న నేపథ్యంలో ఆలోపు కాల్వల మరమ్మతు, పూడికతీత, పొదల తొలగింపు పనులు చేపట్టాలని అధికారులు భావించారు. కానీ షటర్ మొరాయించడంతో ప్రాజెక్టులోని నీరంతా వెళ్లిపోతోంది. దీంతో చేసిది లేక నీరు కాల్వలో పారకుండా ఓ వైపు తవ్వేసి అడవిలోకి వదిలేశారు. పెద్ద మొత్తంలో పారుతున్న ఈ వరద కాగ్నాలో చేరుతోంది. దీనికి అడ్డుకట్ట వేసే మార్గం కనిపించక ఇరిగేషన్ శాఖ అధికారులు తల పట్టుకుంటున్నారు. వీరి ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో మెకానిక్‌ను రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు, మూడు రోజుల పాటు సమస్య ఇలాగే కొనసాగితే నీరంతా ఖాళీ అయ్యే ప్రమాదం ఉంది. గతేడాది కూడా మొరాయించిన బేబీ కెనాల్ షటర్‌ను బాగు చేసేందుకు అధికారులు ముందుకు రాలేదు. దీంతో బూర్గుగడ్డ ప్రాంతానికి చెందిన రైతులు సుమారు రూ.2 లక్షల వరకు చందాలు వేసుకుని నాగార్జునసాగర్ నుంచి టెక్నీషియన్ పిలిపించి, షటర్‌ను బాగు చేయించుకున్నారు.

టెక్నీషియన్‌ను రప్పిస్తున్నాం

కోట్‌పల్లి ప్రాజెక్టు కాల్వలు, తూముల మరమ్మతుల కోసం టెండర్లు వేశాం. అనుభవం లేని వారు పనులు దక్కించుకున్నారు. కాల్వలపై, పక్కన జంగిల్‌ను క్లియర్ చేయమని చెప్పాం. కాల్వలకు బుంగలు పడి నీరు వృథాగా పోతున్న చోట్ల గైడ్ వాల్స్ కట్టాలని సూచించాం. షట్టర్ రిపేర్ అయ్యే వరకు నీటి వృథా తప్పదు. నిజామాబాద్ లేదా నాగార్జునసాగర్ నుంచి శనివారం టెక్నీషియన్లు వస్తారు. కుడి, ఎడమ కాల్వల తూములకు సైతం మరమ్మతులు చేయిస్తాం.

– సుందర్, ఇరిగేషన్ ఈఈ

నిర్లక్ష్యం చేయొద్దు

మెకానిక్‌లను రప్పించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాజెక్టులోని నీరంతా ఖాళీ అయ్యే ప్రమాదం ఉంది. దీంతో రైతులు వేసిన పంటలకు సైతం నీరందదు. ఇప్పటికే వానాకాలం పంటలు నష్టపోయారు. యాసంగి కూడా చేతికందకపోతే ఆత్మహత్యలే శరణ్యం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఏకైక మధ్యతరహా ప్రాజెక్టును అభివృద్ధి చేయాల్సిన బాధ్యతలను వికారాబాద్, తాండూరు ఎమ్మెల్యేలు తీసుకోవాలి. లేదంటే రైతుల పరిస్థితి అగమ్యగోచరమే అవుతుంది.

– వరద మల్లికార్జున్, మాజీ వైస్ ఎంపీపీ

అంధత్వాన్ని తరిమేద్దాం

- అందరి జీవితాల్లో వెలుగులు నింపుదాం
- మంత్రి సబితారెడ్డి
- 'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

నవాబుపేట: అంధత్వాన్ని నివారించి, అందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకే సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి శుక్రవారం ఆమె సందర్శించారు. క్యాంపునకు వస్తున్న ప్రజల సమస్యలు, పరీక్షలు, చికిత్సలకు సంబంధించిన వివరాలను డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొద్దిసేపు జనాలతో ముచ్చటించారు. అద్దాలు ఎలా ఉన్నాయి..? మందులు ఇస్తున్నారా..? పరీక్షలు బాగా చేస్తున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. అంధత్వ నివారణే లక్ష్యంగా కొనసాగుతున్న శిబిరాలతో ఎంతో మందికి సేవలు అందనున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్కరికీ కంటి సమస్యలు ఉండకూడదనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని స్పష్టంచేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఆర్‌డీఓ విజయకుమారి, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ సుమిత్రమ్మ, మండల వైద్యాధికారి రోహిత్, ఎంపీఓ విజయ్‌కుమార్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సర్పంచులు విజయలక్ష్మి, ఎండీ రఫీ, పర్మయ్య, నాయకులు నాగిరెడ్డి, చిట్టెపు మల్లారెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్, ఆనంద్‌రెడ్డి, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

18,350 మందికి నేత్ర పరీక్షలు

నేడు, రేపు శిబిరాలు బంద్

తాండూరు: జిల్లాలో రెండు రోజులుగా నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. గురు, శుక్రవారాల్లో కొనసాగిన క్యాంపులలో ప్రజలకు పరీక్షలు, చికిత్సలు చేశారు. 42 కేంద్రాల్లో 423 మంది వైద్యులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు సేవలు అందించారు. రెండు రోజుల్లో మొత్తం 18,350 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో దగ్గరి చూపు లోపంతో బాధపడుతున్న వారికి అప్పటికప్పుడే కళ్లద్దాలు అందజేశారు. దృష్టిలోపం ఉన్నవారికి పది రోజుల్లో అందజేస్తామని వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. శని, ఆది వారాల్లో కంటి వెలుగు కార్యక్రమాలు ఉండవని తెలిపారు. చిన్నారులు, గర్భిణులకు నెలవారీ టీకాలు ఇవ్వాల్సి ఉన్నందున సోమవారం నుంచి తిరిగి యథావిధిగా క్యాంపులు నిర్వహిస్తామని స్పష్టంచేశారు.



నవాబుపేటలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు

'సాగు సాయాన్ని' పట్టుకోవద్దు

- రైతుబంధు, రైతు బీమా సొమ్మును రుణాల రికవరీకి ముడిపెట్టొద్దు
- లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు
- మర్పల్లిలో బ్యాంకర్లు, అధికారులతో సమావేశం

మర్పల్లి: రైతులకు అందజేస్తున్న సాగు సాయంతో పాటు రైతుబీమా సొమ్మును ఎట్టి పరిస్థితిలోనూ రుణాల రికవరీకి లింక్ పెట్టొద్దని లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు బ్యాంకర్లను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మోమిన్‌పేట, బంట్వారం, మర్పల్లి మండలాలకు చెందిన బ్యాంకు మేనేజర్లు, ఇందిర క్రాంతి పథకం సిబ్బందితో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మర్పల్లి శాఖ మేనేజర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు, మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించాలని సూచించారు. మర్పల్లి, మోమిన్‌పేట, బంట్వారం మండలాల్లో మహిళా సంఘాల రుణాల రికవరీ బాగుందని కితాబిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌లో ఆయా మండలాల మేనేజర్లు 82శాతం రుణాలు వితరణ చేయడం అభినందనీయని తెలిపారు. 60 ఏళ్లు నిండిన మహిళలు వృద్ధాప్య సంఘాలుగా ఏర్పడి ప్రతినెలా కొంత మొత్తాన్ని పొదుపు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ఏఈఓ వెంకట్‌రాంగౌడ్ మాట్లాడుతూ.. 2016, 2018 వరకు ఎస్సీ కార్పొరేషన్ కింద లబ్ధిదారులకు మంజూరైన యూనిట్లను క్లియర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ నర్సింలు, ఎస్‌బీఐ మేనేజర్ కేసీ దాస్, ఎంపీడీఓ మహేశ్‌కుమార్, ఆయా మండలాల బ్యాంకు మేనేజర్లు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

23న మెగా వైద్య శిబిరం

యాలాల: మండల కేంద్రంలో ఈనెల 23న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిర్మాణ్ ఫౌండేషన్, మా శారద హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జనరల్ సర్జరీతో పాటు దంత, గుండెసంబంధిత, గైనకాలజీ, ఆర్థోపెడిక్, బీపీ, షుగర్, ఈసీజీ, పీడియాట్రిక్స్ లాంటి సేవలను అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీఆర్‌ఏ మృతి


ఆశప్ప (ఫైల్)

కొడంగల్: మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న ఆశప్ప గురువారం అర్ధరాత్రి మృతిచెందారు. ఆయన మృతి పట్ల తహసీల్దార్ బుచ్చయ్య, డీటీ సురేశ్, వీఆర్‌ఏల సంఘం జిల్లా కో కన్వీనర్ గోపాల్ సంతాపం ప్రకటించారు. మృతుని కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. మృతుని కుటుంబ సభ్యులకు మండల పరిధిలోని వీఆర్‌ఏలు సానుభూతి తెలిపారు.

రోడ్డు మలుపులో పిచ్చి మొక్కల తొలగింపు


జేసీబీ యంత్రంతో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పోలీసులు

ధారూరు: తాండూరు–హైదరాబాద్ ప్రధాన రోడ్డు మార్గంలోని మలుపుల్లో మొలిచిన పిచ్చి మొక్కలను శుక్రవారం జేసీబీ యంత్రంతో పోలీసులు తొలగించారు. బాచారం–కేరెల్లి మధ్య రోడ్డు మలుపులో గత నవంబర్ 3న ఆటోను లారీ ఢీకొట్టిన సంఘటనలో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో సీఐ అప్పయ్య సూచన మేరకు ఎస్‌ఐ నరేందర్, సిబ్బంది ధారూరు–కేరెల్లి మధ్యన గల ఒంటిమామిడి చెట్టు, అల్లీపూర్, ఎబ్బనూర్, బాచారం, కేరెల్లి రోడ్డు మలుపుల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించారు. వాహనదారులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముందస్తు అరెస్టు

అనంతగిరి: సేవాలాల్ మహరాజ్ జయంతి రోజును ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని అఖిల భారత గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర గిరిజన సంఘాలు శుక్రవారం ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో వికారాబాద్ పోలీసులు రాఘవన్‌నాయక్‌ను ఉదయమే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ మృతి


ఎర్ర వెంకటేశ్ (ఫైల్)

తాండూరు రూరల్: మండల పరిధిలోని వీరశెట్టిపల్లికి చెందిన ఎర్ర వెంకటేశ్ (45)గుండెపోటుతో మృతి చెందారు. తాండూరు డివిజన్ 1098 చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు. ఎంపీటీసీ నర్సమ్మ కుమారుడు ఎర్ర వెంకటేశ్ చైల్డ్ లైన్‌లో పని చేస్తున్నారు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఛాతిలో నొప్పి వచ్చిందని, ఆస్పత్రికి తరలించలోపే కన్నుమూశారని కుటుంబ సభ్యులు తెలిపారు. అంత్యక్రియలు స్వగ్రామం వీరశెట్టిపల్లిలో శుక్రవారం జరిగాయి. వెంకటేశ్ మృతి విషయం తెలుసుకుని ప్రముఖులు, వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు.

యువతి అదృశ్యం


అరుణ (ఫైల్)

చేవెళ్ల: నర్సరీలో పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆలూరులో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్ హయ్యూమ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలూరు గ్రామానికి చెందిన బండారి పద్మ, పద్మారావుల కుమార్తె అరుణ(28) గ్రామంలోని నర్సరీలో రోజువారి కూలీగా పనులు చేస్తోంది. నర్సరీలో పనికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన యువతి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటలైజేషన్ సాధ్యమేనా?

సర్కారు బడుల్లో డిజిటల్ బోధన

- కేంద్రం నిర్ణయంతో మళ్లీ తెరపైకి..
- మొదటి విడతలో పాఠశాలల ఎంపికకు కసరత్తు
- నాడు మూణ్నాళ్లకే మూలకు చేరిన పరికరాలు


పాఠశాలలో డిజిటల్ పాఠాలు వింటున్న విద్యార్థులు (ఫైల్)

వికారాబాద్: పాఠశాలల్లో డిజిటల్ విద్య అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. విద్యా వ్యవస్థలో డిజిటలైజేషన్ అమలు చేయాలని కేంద్రం నిర్ణయించడంతో సాధ్యాసాధ్యాలపై సర్వత్రా చర్చ సాగుతోంది. పాఠశాల విద్యలోనూ సాంకేతికతను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో డిజిటల్ పరికరాలు 2015–16 విద్యా సంవత్సరంలోనే అన్ని ఉన్నత పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసింది. ఇందుకోసం ఒక్కో పాఠశాలకు రూ.లక్షలు వెచ్చించారు. ఆ విద్యా సంవత్సరం ముగిసే లోపే సగం పాఠశాలల్లో పరికరాలు పాడయ్యాయి. దీంతో డిజిటల్ బోధన మూలకు పడింది. 2017–18 విద్యా సంవత్సరంలో అధికారికంగా పాఠశాల బోధనకు ఓ విధానం రూపొందించారు. అయితే గతంలో ఇచ్చిన కంప్యూటర్ల సామర్థ్యం తక్కువగా ఉండటం.. డిజిటల్ తరగతుల కోసం ఇచ్చిన మోడం సామర్థ్యం ఎక్కువగా ఉండటంతో డిజిటల్ బోధన సాధ్యం కావటంలేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

మళ్లీ తెరపైకి..

పది రోజుల క్రితం పాఠశాలలను డిజిటలైజేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బడుల డిజిటలైజేషన్ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. బడుల డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించిన కేంద్రం.. రాష్ట్రంలో యూడైస్ ఆధారంగా 1200 పాఠశాలలను ఎంపిక చేసింది. ఇందులో మన జిల్లాకు చెందిన 35 నుంచి 40 పాఠశాలలు ఎంపికయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఎంపికైన పాఠశాలల్లో డిజిటల్ బోధన, మౌలిక సదుపాయాల కల్పనకు వచ్చే మూడేళ్లలో ఒక్కో పాఠశాలకు రూ. 46 లక్షలు వెచ్చించనున్నారు. అయితే జిల్లాలో ఇప్పటికే అన్ని ఉన్నత పాఠశాలలకు డిజిటల్ పరికరాలు సరఫరా చేసినందున వాటిని మూలకు పడేస్తారా.. లేక వినియోగంలోకి తెస్తారా..? అనేవి ప్రశ్నార్థకంగా మారింది.

నాడు 112 పాఠశాలల్లో ..

2018 సంవత్సరంలో అందించిన డిజిటల్ పరికరాల్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి డిజిటల్ తరగతులు ప్రారంభించారు. జిల్లాలో మొత్తం జెడ్పీహెచ్ఎస్‌లు, కస్తూర్బా పాఠశాలలు, రెసిడెన్షియల్స్, మోడల్ స్కూళ్లు కలిపి 185 ఉండగా అందులో 78 జెడ్పీహెచ్ఎస్‌లు, 17 కేజీబీవీలు, 9 మోడల్ స్కూళ్లు, 8 రెసిడెన్షియల్ స్కూళ్లు కలుపుకుని మొత్తం 112 ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ప్రారంభించారు. ఆరు నెలల తరువాత మిగతా స్కూళ్లకు కూడా డిజిటల్ తరగతులు విస్తరించారు. ఇందులో ప్రభుత్వం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు మూడేళ్ల క్రితమే డిజిటల్ బోధనా పరికరాలు సరఫరా చేయగా కస్తూర్బా, మోడల్, రెసిడెన్షియల్ స్కూళ్లకు తర్వాతి ఏడాది నూతన డిజిటల్ పరికరాలు సరఫరా చేశారు. దీంతో మొత్తం ప్రభుత్వం ఉన్నత పాఠశాలలకు డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చినట్లయ్యింది. కాని ప్రభుత్వ శ్రమ, నిధులు బూడిదలో పోసిన చందంగా మళ్లీ ఎప్పటి లాగే మూణ్నెల్లు తిరిగేలోగా పాఠశాలల్లో డిజిటల్ బోధనకు మంగళం పాడారు.

నిరంతరం కొనసాగాలనే లక్ష్యంతో..

డిజిటల్ తరగతులు బోధనలో ఓ భాగం కావాలి. కానీ ఇవేవి ప్రస్తుతం పాఠశాలల్లో మచ్చుకైనా కనిపించడంలేదు. ప్రస్తుతం డిజిటల్ తరగతులు ఉన్నత పాఠశాల్లోనే ప్రారంభించగా ప్రతి తరగతికి రోజుకు ఒకటి చొప్పున డిజిటల్ తరగతులు బోధించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రోజులో ఒక పిరియడ్‌ను తప్పనిసరిగా డిజిటల్ తరగతుల కోసం కేటాయించాలనే నిబంధన పెట్టారు. దీంతో ప్రతి పాఠశాలలో ఒక్కో తరగతికి ఒక్కో క్లాస్ చొప్పున రోజులో తొమ్మిది క్లాస్‌లు డిజిటల్ రూపంలో తీసుకోవాలి. ఆయా సబ్జెక్టుల్లోని ఒక్కో చాప్టర్ బోధించటానికి వారం నుంచి పది రోజులు పడుతుండగా ఈ డిజిటల్ తరగతుల ద్వారా ఆ చాప్టర్ మొత్తం ఒకటి లేక రెండు పిరియడ్స్‌లో పూర్తి చేస్తారు. డిజిటల్ రూపంలో బోధించినా అంశం అదే అయినప్పటికీ డిజిటల్ తరగతులు రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్లు తయారు చేసి బోధించిన తరగతులు కావటంతో పాటు ఆసక్తికరమైన బొమ్మల ఆధారంగా బోధన జరగనుండటం, విద్యార్థులు సులువుగా నేర్చుకునేందుకు వీలు పడేలా డిజిటల్ తరగతులు రూపొందించారు. కానీ ఇప్పుడు ఏ పాఠశాలల్లోనూ డిజిటల్ తరగతులు జరగడంలేదు.

కొరవడిన పర్యవేక్షణ

2018–19 విద్యా సంవత్సరంలో వంద శాతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు డిజిటల్ పరికరాలు సరఫరా చేశారు. ఇదే సమయంలో అన్ని పాఠశాలల్లో డిజిటల్ తరగతులు సైతం ప్రారంభించారు. కొద్ది రోజులకు పర్యవేక్షణ కరవవడంతో డిజిటల్ బోధన మూలకు చేరింది. దీంతో పాఠశాలలకు సరఫరా చేసిన ప్రొజెక్టర్, స్క్రీన్ తదితర డిజిటల్ పరికరాలు సైతం వృథాగా పడి ఉన్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన పరికరాలు సంవత్సరం తిరక్కుండానే మూలకు చేరడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వంద శాతం పాఠశాలలకు డిజిటల్ పరికరాలు సరఫరా చేయగా ఎక్కడా వాటి ద్వారా బోధన చేయకపోవడంతో విద్యాశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని తెలుస్తోంది.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి. ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 9666572244

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రాజ్యాధికారం కోసం పోరాడుదాం

తలకొండపల్లి: రాజ్యాధికారంతోనే కుమ్మరుల బతుకులు బాగుపడతాయని కుమ్మరి సంఘం (శాలివాహన) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ అన్నారు. అందరు కలిసి కట్టుగా రాజ్యాధికారం కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. శుక్రవారం దేవుని పడకల్‌లో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దయానంద్ మాట్లాడుతూ కుమ్మరుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ప్రగతికి తోడ్పాటు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుమ్మరులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి, తదితర రంగాల్లో వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

నిమోనియా వ్యాధితో టెన్త్ విద్యార్థిని మృతి


అంబిక (ఫైల్)

కుల్కచర్ల: నిమోనియా వ్యాధితో పదో తరగతి విద్యార్థిని మృతిచెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. రాంపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అంబిక అనే విద్యార్థిని పదో తరగతి చదువుతోంది. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. బాలిక తండ్రి శంకర్ రెండు నెలల క్రితమే మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. అంబిక మృతితో తండాలో, పాఠశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాధిత కుటుంబీకుల రాస్తారోకో

వసతి గృహ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని అంబిక మృతి చెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబీకులు, గిరిజన సంఘాల నేతలు కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థిని సంరక్షణలో వసతి గృహ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినికి సరైన వైద్యం అందించడంలో శ్రద్ధ చూపలేదని ఆరోపించారు. దోమ ఎంఈఓ హరిశ్చందర్, పరిగి, దోమ ఎస్‌ఐలు విఠల్‌రెడ్డి, విశ్వజన్ బాధిత కుటుంబ సభ్యులను సముదాయించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.


రాస్తారోకో నిర్వహిస్తున్న బాధిత కుటుంబీకులు, గిరిజన సంఘాల నేతలు

60వేల మందితో సామాజిక సేవలు

- మార్వాడీ యువమంచ్ సభ్యుల వెల్లడి
- ఘనంగా యువమంచ్ ఆవిర్భావ దినోత్సవం
- టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ
- ప్రతిభ చాటిన విద్యార్థినులకు సన్మానం


మార్వాడీ యువమంచ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

తాండూరు టౌన్: సామాజిక సేవే మార్వాడీ యువ మంచ్ లక్ష్యమని మంచ్ సభ్యులు తెలిపారు. శుక్రవారం యువమంచ్ 39వ ఆవిర్భావ వేడుకలను స్థానిక బాలాజీ మందిర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురు టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. మారేపల్లి లోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. పదో తరగతి సాంఘిక శాస్త్రంలో రాష్ట్ర స్థాయి ఐదో ర్యాంకు సాధించిన మహేశ్వరిని, జాతీయ అథ్లెటిక్స్‌కు ఎంపికైన గాయత్రిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్ సార్డా, తాండూరు అధ్యక్ష, కార్యదర్శులు బ్రిజ్‌మోహన్ బూబ్, కిషన్ రాఠి, కోశాధికారి అరుణ్‌సార్డా, మాజీ అధ్యక్షులు సన్నిఅగర్వాల్‌లు మాట్లాడుతూ 1977 జనవరిలో గౌహతిలో మార్వాడీ యువమంచ్‌ను ఏర్పాటుచేశారన్నారు. ప్రస్తుతం 729 శాఖలతో 60వేల మందితో మంచ్ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. తాండూరు ప్రాంతంలో సైతం ప్రతి ఏటా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐదుగురు టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు పౌష్టికాహార కిట్లను అందజేయనున్నామన్నారు. కార్యక్రమంలో మంచ్ తాండూరు ఉపాధ్యక్షులు అనిల్‌సార్డా, ఆశిష్‌సార్డా, సహ కార్యదర్శులు కరన్‌జైన్, గోపాల్ రాఠి, పవన్ సోని తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధన తప్పనిసరి

- కలెక్టర్ నిఖిల
- సైన్స్ ఫెయిర్‌లో జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయికి చేరడం అభినందనీయం


విద్యార్థులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న కలెక్టర్, డీఈఓ

వికారాబాద్ అర్బన్: జీవితంలో ఎంచుకున్న లక్ష్యాన్ని చేరేందుకు నిరంతరం సాధన అవసరమని కలెక్టర్ నిఖిల విద్యార్థులకు సూచించారు. రాష్ట్రస్థాయిలో నిర్మల్ జిల్లాలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన జిల్లాకు చెందిన విద్యార్థులు డీఈఓ రేణుకాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇన్‌స్పైర్ విభాగం నుంచి ఇద్దరు విద్యార్థులు, సైన్స్ ఫెయిర్ విభాగం నుంచి ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులకు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనడానికి అవకాశం ఉంటుందని అక్కడ కూడా తమ ప్రతిభను చాటి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గేను కలిసిన రామ్మోహన్‌రెడ్డి


మల్లికార్జున్ ఖర్గేతో టీఆర్ఆర్

పరిగి: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను శుక్రవారం ఢిల్లీలో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేలా నాయకులందరూ కష్టపడి పనిచేయాలని సూచించారన్నారు. సీఎం కేసీఆర్‌పై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నరని కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని, నిత్యం ప్రజల మధ్యలో ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సూచించినట్లు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

త్వరలో తాండూరులో పర్యటిస్తా

తాండూరు: త్వరలో తాండూరులో పర్యటిస్తానని మల్లికార్జున్ ఖర్గే తెలిపారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్ మహరాజ్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని ఖర్గే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. 2017లో తాండూరుకు వచ్చానని తర్వాత అటువైపు రాలేదని, త్వరలో తాండూరుకు వస్తానని చెప్పినట్లు తెలిపారు.

తగ్గుతున్న జొన్న సాగు



- కనుమరుగవుతున్న పంట
- పందుల బెడదే కారణం

కొడంగల్: జొన్న సాగు విస్తీర్ణం ఏటేటా తగ్గుతోంది. గ్రామాల్లో ఎక్కడో ఒక చోట తప్ప జొన్న పంట కనిపించడం లేదు. జొన్న పంటకు పందుల బెడద అధికంగా ఉందని, అందుకే సాగు తగ్గించామని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో దశాబ్దకాలంగా మార్పులు వస్తున్నాయి. సంప్రదాయ పంటల సాగు క్రమంగా తగ్గింది. వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయంలో వస్తున్న మార్పుల ఆధారంగా సంప్రదాయ పంటల స్థానంలో కొత్త పంటలు వచ్చి చేరాయి. తక్కువ వ్యవధిలో అధిక లాభాలు వచ్చే పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గంలో గతం నుంచి కంది, జొన్న పంటలను సాగు చేసేవారు. పంట మార్పిడి విధానంలో ఒక సంవత్సరం కందిని వేస్తే మరో సంవత్సరం జొన్నను వేసేవారు. ఈవిధంగా ప్రతి సంవత్సరం మార్పిడి జరిగేది. దీని వల్ల రైతులకు దిగుబడితో పాటు తిండి గింజలకు కొదవ ఉండేది కాదు. కంది పంట రైతులను ఆర్థికంగా ఆదుకోవడంతో కంది సాగు కొనసాగుతోంది. కాలక్రమేణా జొన్న, పెసర, మినుము పంటల సాగుకు రైతులు విముఖత చూపుతున్నారు. ఎందుకంటే జొన్నకు పందుల బెడద ఉంది. అంతేకాకుండా ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో సాగుకు రైతులు దూరం అవుతున్నారు. దశాబ్దకాలంగా సాగుచేసిన పంటల వివరాలు ఇందుకు నిదర్శనం. పొద్దు తిరుగుడు, నువ్వులు, ఆముదం, వేరుశనగ, సజ్జ, ఉల్లి పంటలు సైతం అంతరించిపోయే దశలో ఉన్నాయి. అధిక పోషకాలు, ఔషధ గుణాలు కలిగిన పాత పంటలు కొర్ర, రాగి, చామలు, నువ్వులు, గడి నువ్వులు సాగు ఊసే లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో జొన్నలకు డిమాండ్ పెరుగుతోంది. జొన్న రొట్టెలు తినడానికి ఇష్టపడుతున్నారు. వైద్యులు కూడా జొన్న రొట్టెలు తినాలని సూచిస్తున్నారు. దీంతో జొన్న రొట్టెలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. రైతులు జొన్న పంటల వైపు మొగ్గు చూపాలని విద్యావంతులు కోరుతున్నారు.

సాగు విస్తీర్ణం పెరగాలి



జొన్న పంట సాగు విస్తీర్ణం పెరగాలి. ప్రస్తుతం నాణ్యమైన జొన్నలకు మంచి డిమాండ్ ఉంది. హైదరాబాద్ వంటి నగరాల్లో ఎక్కువ మంది జొన్న రొట్టెలు తింటున్నారు. పిజ్జాలు, బర్గర్లు తినే కాలం పోయింది. జనాలు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. రైతులు జొన్న పంటను వేయాలి. పంటను పందుల నుంచి కాపాడుకోడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి.

– బస్వరాజ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్, అంగడిరాయిచూర్

హిందూ ధర్మాన్ని కాపాడుదాం


పూజారులను సన్మానిస్తున్న రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు

దోమ: గ్రామీణ ప్రాంత ప్రజలు హిందు ధర్మాన్ని కాపాడేందుకు ముందుకు సాగాలని రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ అన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని మైలారం, బొంపల్లి, దోమతో పాటు ఆయా గ్రామాలలో దేవాలయాల్లో ఉన్న పూజారుల దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతన వస్త్రాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలోని ప్రజలందరూ హిందూ సంప్రదాయలను కాపాడుకుంటూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా కార్యదర్శి కేశవులు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు యాదయ్య, మండల ప్రధానకార్యదర్శి విజయ్‌కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌రావు, పరిగి మున్సిపల్ ప్రధానకార్యదర్శి ఆంజనేయులు, పూడురు మండల అధ్యక్షుడు అనిల్, పూడూర్ మండల ఉపాధ్యక్షుడు మల్లేశ్‌నాయక్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.